సంస్మరించుకుందాం

# కామ్రేడ్స్ విశ్వమోహనరెడ్డి, మరియమ్మలకు జోహార్లు

**పీడిత** ప్రజాఉద్యమ నాయకుడు, ప్రజారచయిత కామ్రేడ్ విశ్వమోహనరెడ్డి, రైతుకూలీ ఉద్యమ నాయకురాలు కా॥మరియమ్మలను 2000 సం॥ ఏప్రిల్ 11న రాజ్యం హత్యగావించింది.

కడప జిల్లాలో సంపన్న కుటుంబంలో పుట్టిన **కా॥ వివిఎంఆర్** చిన్నవయసులోనే పీడితవర్గ రాజకీయాలను స్వీకరించారు. జీవితంలో కష్టాల్ని, శ్రమజీవులపై గ్రామీణ ఫ్యూడల్ పెత్తందార్లు సాగించే నికృష్ట శ్రమదోపిడీ, క్రౌర్యాలను స్వయంగా చూశాడు; వాటికి గురయ్యాడు. ఎమర్జన్సీ నిర్బంధ కాలంలో రిక్షా కార్మికునిగా, హోటల్ సర్వర్‌గా, వివిధ పనులు చేసుకుంటూ ఆయారంగాల ప్రజలను సంఘటితపరిచాడు. విలక్షణమైన రచయితగా ఎన్నో నవలలు రాశాడు. ప్రచారార్భాటాలకు దూరంగా అలజడి జీవితంగా, ఆందోళన ఊపిరిగా, పోరాటం లక్ష్యంగా జీవించాడు. ప్రజాశత్రువుల పట్ల నిర్దాక్షిణ్యమైన ద్వేషం, పీడిత ప్రజల పట్ల అంతులేని ఔదార్యం ప్రదర్శించాడు. పల్నాడు, వినుకొండ, దొనకొండ ఏరియాలలో విస్తృతంగా ప్రజా పోరాటాలు నిర్మించాడు. అక్రమ నిర్బంధాలు, అరెస్టులు, కేసులు, జైలుశిక్షలు అనుభవించాడు. లెనిన్‌నగర్, టి.ఎన్.నగర్‌ల ఏర్పాటుకు నాయకత్వం వహించాడు. గ్రామీణ పేదలను కదిలించి విస్తృతంగా భూపోరాటాలు నిర్వహించాడు. పోలియోతో చిన్న వయసులోనే అంగవికలురాలైన ఇందిరగారిని కోరి ఆదర్శ వివాహం చేసుకున్నారు. త్యాగధనుడు కా॥ విశ్వమోహనరెడ్డికి విప్లవ జోహార్లు.

**కా॥ మరియమ్మ** అట్టడుగు దళిత శ్రామిక కుటుంబంలో పుట్టి, గృహిణిగా, క్రైస్తవ భక్తురాలిగా వుంటూ, ఉద్యమాలలో పాల్గొంటూ క్రమంగా చైతన్యవంతురాలై రైతుకూలీ సంఘం కార్యకర్తగా, నాయకురాలిగా ఎదిగింది. సంఘ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న క్రమంలో రౌడీగూండాల దాడులు, పోలీసు నిర్బంధం, కేసులతో పాటుగా కుటుంబపు ఆటుపోట్లను, దోపిడీశక్తుల నీచమైన ప్రచారాలను తట్టుకొని నిలిచింది. శారీరక, మానసిక చిత్రహింసలెన్నింటినో భరించింది. ప్రజల ఆశయం కోసం నిలిచి పోరాడి పోలీసు తుపాకి గుళ్ళకు నేలకొరిగింది. కామ్రేడ్ మరియమ్మకు జోహార్లు.

* * * * *